నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 30 సెప్టెంబర్ 2024 | KARIMNAGAR

ఎలక్ట్రిక్ బస్సులతో పర్యావరణ రక్షణ

- దశలవారీగా డీజిల్ బస్సులు తొలగిస్తాం • పత్రి పల్లెకూ బస్సులు నడిపిస్తాం • ఆర్టీసీలో మూడు వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం
- బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ • కరీంనగర్ జిల్లా కేంద్రంలో 35 సూపర్ లగ్జరీ ఎలక్ట్రికల్ బస్సులు ప్రారంభం

బస్సుకు పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ తెలంగాణచౌక్, సెప్టెంబర్ 29: భవిష్యత్ తరాలకు కాలుష్యరహిత వాతావరణం అందించడానికి ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చామని, దశలవారీగా డీజిల్ బస్సులు తొలగిస్తామని, పత్రి పల్లెకూ బస్సులు నడిపిస్తామని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కరీంనగర్ రీజియన్‌కు కేటాయించిన 35 సూపర్ లగ్జరీ ఎలక్ట్రికల్ బస్సులను స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సజ్జనార్, మానకొండూర్, చొప్పదండి, జగిత్యాల ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, డాక్టర్ సంజయ్‌కుమార్, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయి, మేయర్ సునీల్‌రావు, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. డీజిల్ భారాన్ని తగ్గించుకోవడంతోపాటు కాలుష్య రహితం కోసం 2,500 ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేయగా, వెయ్యి బస్సులు అందుబాటులోకి వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో డీజిల్ బస్సులను పూర్తిగా తొలగిస్తామన్నారు. త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసి టీజీ ఆర్టీసీలో మూడు వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. దసరాలోగా ఉద్యోగులకు బాండ్ల రూపంలో ఉన్న బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు 92 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకోగా, సంస్థకు రూ.3,200 కోట్ల ఆదాయం చేకూరిందన్నారు. గ్రామ సమాఖ్య సంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేయిస్తామని తెలిపారు.

ప్రయాణికులతోనే సంస్థకు మనుగడ

ప్రయాణికుల మన్ననలతోనే ఆర్టీసీ మనుగడ కొనసాగుతున్నదని సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చి 300 రోజులు అవుతుందని, ఇప్పటి వరకు కరీంనగర్ రీజియన్‌లో 2 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో 500 ఎలక్ట్రిక్ బస్సులు నడస్తున్నాయని, మరో 500 బస్సులను కరీంనగర్, వరంగల్, నిజామాబాద్‌కు కేటాయించామన్నారు. త్వరలోనే నిజామాబాద్, వరంగల్ రీజియన్‌లో ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిపారు. బస్టాండ్లలో ప్రయాణికులకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముజిశేఖర్, రీజియన్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు భూపతి రెడ్డి, సత్యనారాయణ, డీఎంలు మల్లయ్య, విజయమాధురి పాల్గొన్నారు.

జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఆఖరి మజిలీకి అవస్థలు

పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్న శ్మశానవాటిక

మారుతీనగర్, సెప్టెంబర్ 29: మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు సింగాపూర్ కాలనీ శివారులోని స్మశానవాటికకు వెళ్లే దారి పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైంది. ఆఖరి మజిలీకి కార్యక్రమానికి వచ్చే బంధుమిత్రుల అవస్థలు అంతా ఇంతా కాదు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు చెబుతున్నారు.

హామీలు అమలు చేసేదాకా పోరాడుతాం

- బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 29 : కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సభలో బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా పోరాడుతామని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈమేరకు కరీంనగర్‌లో పలు బీసీ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీల అమలు విషయంలో కాంగ్రెస్ సర్కారు ఎందుకు జాప్యం చేస్తుందో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయాలని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గతనెల 25న హైదర్‌గూడలోని కేంద్ర కార్యాలయంలో ఆమరణ దీక్ష చేపట్టిన తర్వాత పోలీసులు అరెస్ట్ చేసి అనేక ఇబ్బందులు పెట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వం తరపున పెద్దలు వచ్చి తమతో సంప్రదింపులు జరపడంతో దీక్ష విరమించామని తెలిపారు. కానీ, 20రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వెంటనే కులగణన ప్రక్రియ చేపట్టకపోతే మళ్లీ ఆమరణ దీక్షకు సిద్ధమని, రాష్ట్ర వ్యాప్త పోరాటాన్ని ఉధృతం చేస్తామని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసేదాకా పోరాడుతామని స్పష్టం చేశారు.

అధికారుల పేరుతో హాంఫట్?

- ఇవ్వకుండానే ఇచ్చినట్లు లెక్కలు
- మిల్లర్స్ అసోసియేషన్‌లో వెలుగులోకి వస్తున్న కొత్త కోణాలు
- రెండు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి
- 'నమస్తే తెలంగాణ' కథనంతో అధికారుల్లో కదలిక
- మా వద్దకు వస్తే మేమే తేల్చిచెబుతాం
- నిజాయితీ అధికారులకు కూడా ముడుపుల బాగోతం అంటగడుతున్నారంటూ ఆగ్రహం

అధికారులకు ముడుపుల పేరుతో మిల్లర్స్ యాజమాన్యాల నుంచి అసోసియేషన్లు వసూలు చేస్తున్న డబ్బుల్లో భారీగా గోల్‌మాల్ జరుగుతుందా? సంబంధిత అధికారులకు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రూ.లక్షల్లో లెక్కలు చూపుతున్నాయా? మేం చెప్పింది వేదం.. మమ్మల్ని లెక్కలడిగే దమ్ము ఎవరికి ఉంది? అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయా? నిజాయితీ అధికారులకు సైతం ముడుపుల మచ్చను అంటగడుతున్నాయా? అంటే తాజా, పరిణామాలు అవుననే చెబుతున్నాయి. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ల నుంచి అధికారులకు భారీ ముడుపులు?, మిల్లర్ల గొడవతో బయటకు వస్తున్న బాగోతం పేరుతో ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన చాలామంది అధికారులు మిల్లర్స్ అసోసియేషన్లలో జరుగుతున్న గుట్టు విప్పారు. అంతేకాదు.. లెక్కల్లో రాసిన పేర్లను తీసుకొని వస్తే.. ఏది నిజమో ఏది అబద్ధమో తేలుతుందని సదరు అధికారులు ఘంటా పథంగా చెప్పడం చూస్తే.. మిల్లర్స్‌కు అండగా నిలవాల్సిన అసోసియేషన్లు.. మసిబూసి మారేడుగాయ చేస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

-కరీంనగర్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

నిజానికి మిల్లర్స్ అసోసియేషన్లకు ఒక చరిత్ర ఉంది. అసోసియేషన్ పరిధిలోని ఏ మిల్లర్‌కు కష్ట మొచ్చినా వారికి అండగా నిలవాలి. అవసరమైతే అధికారులతో మాట్లాడాలి. ఇదే సమయంలో నిబంధనలకు లోబడి మిల్లులను నడిపేలా చూడాలి. దీంతోపాటు అక్రమ పద్ధతుల్లో వెళ్లే మిల్లర్ల వ్యవహారాన్ని ఈసీ ముందు పెట్టడంతో పాటు, జనరల్‌బాడీ మీటింగ్‌లో పెట్టి చర్చించాలి. మొత్తంగా అసోసియేషన్లు తమ స్వార్థం కోసం కాకుండా.. రైస్ ఇండస్ట్రీ బాగోగుల కోసం పోరాడాలి. అసోసియేషన్ బైలా ఇదే సూచిస్తున్నది. అంతే కాదు.. అన్ని జిల్లాల్లోనూ దాదాపు రూ.5 వేలకు మించి ఖర్చు చేయాల్సి వస్తే.. ఈసీ మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఇలాంటి అనేక అంశాలకు పలు అసోసియేషన్లు తూట్లు పొడుస్తున్నట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కానీ, ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని రెండు జిల్లాల్లో మాత్రం అసోసియేషన్లు పూర్తిగా అడ్డదారుల్లో వెళ్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. నిజాయితీగా, నిబంధనలకు లోబడి నడుచుకునే మిల్లర్లను కాదని.. అడ్డదారుల్లో వెళ్లే వారికి అసోసియేషన్లు అండలం వేస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు.. ధాన్యం, ర్యాకులు, బెడ్ల కేటాయింపుల్లోనూ వారికే ముందు ప్రాధాన్యం ఇవ్వడానికి కొన్ని అసోసియేషన్లు తహతహలాడుతున్నాయి. దీని వెనుక పెద్ద తతం గం జరుగుతుందన్న చర్చ ప్రస్తుతం మిల్లర్స్‌లో నడుస్తోంది. అంతేకాదు.. అడ్డదారుల్లో నడుస్తున్న కొంత మంది వల్ల రైస్ ఇండస్ట్రీ వ్యవస్థకు చెడ్డ పేరు రావడమే కాకుండా.. నిజాయితీగా మెదలిన మిల్లర్స్‌ను కూడా ప్రజలు అదే కోణంలో చూస్తున్నారన్న అందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో.. ప్రతి అసోసియేషన్ బైలా ప్రకారం నడుచుకోవడంతోపాటు.. నిబంధనలకు లోబడి నడిచే మిల్లర్లకు అండగా నిలువాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భారీ గోల్‌మాల్?

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రెండు జిల్లాల్లో అసోసియేషన్స్ తప్పుడు పద్ధతుల్లో వెళ్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అధికారుల పేరుతో మిల్లర్స్ నుంచి వసూలు చేస్తున్న డబ్బుల్లో భారీ గోల్‌మాల్‌కు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నుంచి అధికారులకు భారీ ముడుపులు?.. మిల్లర్ల గొడవతో బయటకు వస్తున్న బాగోతం..' పేరుతో ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం అధికారుల్లో సంచలనం సృష్టించింది. ఒక్క మాటలో చెప్పాలంటే వారిని కదిలించింది. అంతేకాదు.. మిల్లర్స్ అసోసియేషన్స్ నుంచి ఏ అధికారికి ఎంత ముడుపులు ముట్టినట్లుగా లెక్కలు చూపారన్న విషయాన్ని ఎండగట్టడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖతో సంబంధం ఉన్న కొంత మంది అధికారులు ఆదివారం 'నమస్తే తెలంగాణ'కు ఫోన్ చేసి వాస్తవాలను వివరించారు. రూ.లక్షల్లో డబ్బులు ఇచ్చినట్లుగా అసోసియేషన్ వాళ్లు లెక్కలు రాసుకోవడం తప్ప.. ఆచరణలో పూర్తి అబద్ధమన్నారు. ఏదేని సందర్భంగా ఒక వేళ ఏమైనా సహాయం చేయమని అడిగినా.. ఇప్పుడు మిల్లర్స్ అసోసియేషన్ వసూలు చేయడం లేదంటూ తమనే బెదిరిస్తున్నారంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం ముగ్గురు అధికారుల పేరుతో ఒకరికి రూ.15 లక్షలు, మరో ఇద్దరికి రూ.10 లక్షల చొప్పున ఇచ్చినట్లు అసోసియేషన్ లెక్కలు చూపినట్లుగా తమకు సమాచారం ఉందని, 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన వార్తతో లెక్కలు నిజమనే విషయం అర్థమైందన్నారు. కాబట్టి.. ఈ లెక్కలు తేలాలంటే.. ఒక్కటే పరిష్కారం ఉందంటూ ఓ అధికారి వ్యాఖ్యానించారు. రూ.లక్షల్లో ముడుపులు ఇచ్చినట్లు చెపుతున్న వ్యక్తులతోపాటు ఆయా అసోసియేషన్ల ఈసీ సభ్యులను తీసుకొని.. సదరు అధికారుల వద్దకు వస్తే వాస్తవాలు ఏంటో తెలుస్తాయని ఓ అధికారి పేర్కొన్నారు. ఎవరి స్వార్థం కోసం వారు.. లెక్కలు రాసుకొని.. తమను బలిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మరో అధికారి వాపోయారు. అధికారులకు ముడుపుల పేరుతో వసూలు చేయడం.. లెక్కల్లో ఇచ్చినట్లుగా రాయడం.. అవి ఎవరి ప్రయోజనాలకో వాడుకోవడం.. ఆ బదనాంను అధికారులపై రుద్దడం వంటి అంశాలు రెండు జిల్లాల్లో జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చాయని మరో అధికారి పేర్కొన్నారు. అయితే.. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే.. సదరు అధికారులపై చర్యలు తీసుకుంటే ఫరవాలేదు కానీ.. నిబంధనలకు లోబడి పనిచేసిన అధికారులకు రూ.లక్షలు ఇచ్చినట్లు అసోసియేషన్‌లో లెక్కలు రాసి.. ప్రతి మిల్లర్ ముందు తమను దోషులుగా చిత్రీకరిస్తున్న తీరు బాధాకరంగా ఉందని సదరు అధికారులు వ్యక్తం చేశారు. ఇలాంటివి జరకుండా ఉండాలంటే.. ఎక్కడో ఒక చోట బ్రేక్ పడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నిజానికి అధికారులు చెప్పిన విషయాన్ని లోతుగా పరిశీలిస్తే.. అసోసియేషన్లు వివిధ కారణాలు చూపుతూ వసూళ్లకు పాల్పడి.. వాటిని సొమ్ముచేసుకుంటున్నారన్న విషయం స్పష్టమవుతున్నది. ఇదే సమయంలో.. ఎవరైనా అధికారుల్లో అక్రమార్కులుంటే.. మిల్లర్స్‌తో కలిపి అసోసియేషన్లు సదరు అధికారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలే తప్ప.. మిల్లర్ల నుంచి వసూలు చేసి.. రూ.లక్షల్లో లంచాలు ఇచ్చినట్లుగా చూపడం భవిష్యత్‌కు మంచిది కాదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మామూళ్ల వ్యవహారంపైనా మిల్లర్స్‌లో భారీ చర్చ నడుస్తోంది. అధికారుల పేరుతో వసూలు చేసింది ఎంత? వాళ్లకు ఇచ్చింది ఎంత? లెక్కలు చూపుతున్నది ఎంత? అన్న అంశాలపై ప్రధాన చర్చ జరుగుతోంది. తాజా, పరిస్థితుల నేపథ్యంలో అసోసియేషన్లు అడ్డదారులు మాని.. మిల్లర్లకు అండగా నిలిచి రైస్ ఇండస్ట్రీని కాపాడుకునే అంశంపై దృష్టిపెడితే వ్యక్తికి కాదు.. యావత్తు వ్యవస్థకు మేలు చేకూరుతుందన్న అభిప్రాయాలు మిల్స్ యజమానుల్లో వ్యక్తమవుతున్నాయి.

గుర్తింపు సరే.. నిధులేవి?

- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్
- రెండేండ్లుగా జాడలేని ఫండ్స్
- ఈ ఏడాదీ అనుమానమే..
- పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజారోగ్యానికి భరోసానిచ్చే ప్రాథమిక వైద్యశాలలు చిత్తవుతున్నాయి. నిధులు రాక నీరసించిపోతున్నాయి. 'ప్రభుత్వ వైద్యాన్ని పరుగులు పెట్టిస్తాం.. ప్రతి వ్యక్తికి వైద్యాన్ని అందుబాటులోకి తెస్తాం' అంటూ గొప్పలు చెప్పకునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) గుర్తింపు పొందిన ఆరోగ్య కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఎంపికైన వైద్యశాలకు మూడేళ్ల పాటు ఏటా ప్రోతాహకంగా ఇచ్చే నిధులను సైతం రెండేండ్లుగా ఇవ్వకుండా వేధిస్తున్నాయి. ఈ ఏడాది అయినా వస్తాయా..? రావో అన్న అనుమానాలు వ్యక్తమవుతుండగా, వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం

జగిత్యాల, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): గ్రామీణ, సెమీ అర్బన్, అర్బన్ ప్రాంతాల్లోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడం, మంచిగా సేవలందిస్తున్న పీహెచ్‌సీలను మరింత బలోపేతం చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్వాస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, నేషనల్ హెల్త్ సిస్టమ్ విభాగం సంయుక్తంగా ఎన్‌క్వాస్ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నాయి. ప్రతి ఏడాది దేశవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎన్‌క్వాస్ బృందాలు పరిశీలిస్తాయి. ఆరోగ్య కేంద్రాల్లో నమోదవుతున్న అవుట్ పేషెంట్ల సంఖ్య, లేబర్ రూములు, ల్యాబ్, నేషనల్ హెల్త్ ప్రోగ్రాంలపై కల్పిస్తున్న అవగాహన, ఆరోగ్య కేంద్రం జనరల్ అడ్మినిస్ట్రేషన్లను పరిశీలించి వాటికి మార్కులు కేటాయిస్తారు. 75 మార్కులు సాధించిన ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌క్వాస్ పరిధిలోకి ఎంపిక చేసి, ఆయా సెంటర్లకు అదనంగా నిధులు మంజూరు చేస్తారు.

నిధుల మంజూరు ఇలా..

ఎన్‌క్వాస్ పరిధిలోకి ఎంపికైన ఆరోగ్య కేంద్రాలకు ప్ర భుత్వం ప్రతి ఆర్థిక సంవత్సరం అదనంగా నిధులు మంజూరు చేయాలని నిర్ణయించింది. మండల స్థాయి లో ఉన్న పీహెచ్‌సీలకు ఏటా ₹3లక్షలు అదనంగా మం జూరు చేయాల్సి ఉంటుంది. పట్టణ, అర్బన్ ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీలకు ఏటా ₹2లక్షలు అదనంగా మంజూ రు చేస్తుంది. ఇక మండల స్థాయిలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు ఏడాదికి ₹1.26లక్షలు మంజూ రు చేయాలి. సాధారణంగా ప్రభుత్వం పీహెచ్‌సీలకు ఏటా కేటాయించే నిధులతోపాటు ఈ ఫండ్స్ అదనంగా మంజూరు చేయాల్సి ఉంటుంది. ఒక్కసారి ఎన్‌క్వాస్ గుర్తింపు పొందితే మూడేండ్ల పాటు నిధులు మంజూరు చేయాల్సి ఉంటుంది. మూడేండ్ల తర్వాత మరోసారి ఎన్‌క్వాస్ గుర్తింపు బృందం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, ఎన్‌క్వాస్ స్టాండర్డ్స్‌ను కొనసాగిస్తుందా..? లేదా అని పరిశీలిస్తుంది. కొనసాగిస్తే మరో మూడేండ్ల పాటు అదనంగా నిధులు మంజూరు చేయాల్సి ఉంటుంది.

ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి..

ఎన్‌క్వాస్ ద్వారా వచ్చే అదనపు నిధుల్లో 75శాతం నిధులతో ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి పథంలో నడిపించాల్సి ఉంటుంది. సెంటర్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు వీటిని వినియోగించాల్సి ఉంటుంది. అదనపు మందులు, దవాఖానలో వైద్య పరికరాల కొనుగోలు, మంచినీటి సౌకర్య కల్పన, మంచాల ఏర్పాటు, బాలింతలు, గర్భిణులకు వైద్య సదుపాయాల కల్పన తదితర వాటికి ఈ నిధులను ఖర్చు చేయాలని నిర్దేశించారు. ఇక మిగిలిన 25 శాతం నిధులను ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి ఇన్సెంటివ్‌లు (ప్రోత్సాహకాలు) అందించేందుకు నిర్దేశించారు.

ఉమ్మడి జిల్లాలో గుర్తింపు కేంద్రాలు

కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో పదుల సంఖ్యలో ఎన్‌క్వాస్ గుర్తింపు పొందిన ఆరోగ్య కేంద్రాలు ఉండగా, అందులో జగిత్యాల జిల్లాలో 17 సెంటర్లు ఉన్నాయి. అందులో ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కొడిమ్యాల, కథలాపూర్, మేడిపల్లి, పెగడపల్లి పీహెచ్‌సీలు గతంలోనే ఎన్‌క్వాస్ గుర్తింపును పొందాయి. అలాగే కల్లెడ అర్బన్ హెల్త్ సెంటర్, జెఎస్ రాంవెల్ అర్బన్ హెల్త్ సెంటర్, మోతెవాడ అర్బన్ హెల్ సెంటర్ సైతం ఎన్‌క్వాస్ విభాగానికి ఎంపికయ్యాయి. ఇక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విభాగానికి సంబంధించి ఆత్మకూర్, పైడిమడుగు, వేములకుర్తి, ధరూర్, నూకపెల్లి, రేచపల్లి, దొంతాపూర్, కట్కాపూర్ కేంద్రాలు ఎంపికయ్యాయి. మొత్తంగా 17 కేంద్రాలున్నాయి. అందులో 6 పీహెచ్‌సీలకు ఏటా ₹3 లక్షల చొప్పున, 3 అర్బన్ కేంద్రాలకు ఏటా ₹2ల క్షల చొప్పున 8 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు ఏటా ₹1.26 లక్షల చొప్పున ప్రభుత్వం నిధు లు చెల్లించాల్సి ఉంది. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో నేరెళ్ల, గొల్లపల్లి, ఒడ్డెలింగాపూర్, జగ్గసార్ పీహెచ్‌సీలు ఎన్‌క్వాస్ స్టాండర్స్‌ను సాధించాయి. పెద్దపల్లి జిల్లాలో కమాన్‌పూర్, గరిపెల్లి, రాఘవపూర్, రాగినేడు, రామగుండం, ఎలిగేడు, జూలపెల్లి, కాల్వ శ్రీరాంపూర్ పీహెచ్‌సీలు ఎన్‌క్వాస్ స్టాండర్స్‌ను సాధించాయి. అర్బన్ హెల్త్ కేంద్రాల విభాగాల్లో లక్ష్మీపూర్, అడ్లగడ్డ కేంద్రాలు నమోదయ్యాయి. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి సుల్తాన్‌పూర్, దూళికట్ట, కల్వచర్ల, కనగర్తి కేంద్రాలు ఎన్‌క్వాస్ స్టాండర్స్ సాధించాయి. సిరిసిల్ల జిల్లాలో కోనరావుపేట, సుందరయ్యనగర్ ఆరోగ్య కేంద్రాలు ఎన్‌క్వాస్ స్టాండర్స్ సాధించాయి. మరో 7 కేంద్రాలు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంపికకు అర్హత సాధించాయి. కరీంనగర్ జిల్లా పరిధిలో 9 ఆరోగ్య కేంద్రాలు ఎన్‌క్వాస్ గుర్తింపునకు నోచుకున్నాయి.

రెండేళ్లుగా జాడలేని నిధులు

ఎన్‌క్వాస్‌కు సంబంధించిన నిధులు రెండేండ్లు గడుస్తున్నా రావడం లేదు. ప్రొసీడింగ్స్ ఇస్తున్న అధికారులు నిధులు మాత్రం మంజూరు చేయడం లేదని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఎన్‌క్వాస్ గు ర్తింపు పొందిన సెంటర్లకు అదనపు నిధులు ఇచ్చే విధా నం చాలా ఏండ్ల క్రితమే ప్రారంభమైంది. అయితే కరో నా నేపథ్యంలో రెండేండ్ల పాటు ఎన్‌క్వాస్ పరిశీలన, నిధుల మంజూరు విషయాలను ప్రభుత్వం నిలిపివేసింది. ఆ తర్వాత సంవత్సరాల్లో మాత్రం ఎన్‌క్వాస్ గు ర్తింపు పరిశీలనతోపాటు నిధుల మంజూరు ప్రక్రియను ప్రారంభించింది. 2022-2023, 2023-2024 ఆర్థిక సంవత్సరాలు గడిచాయి. అందులో మొదటి ఆర్థిక సంవత్సరంలో కొన్ని పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ గుర్తింపు నిధులను విడుదల చేయగా, అవి కొన్నింటికి మాత్రమే అందాయి. చాలా ఆరోగ్య కేంద్రాలకు నిధులు రాలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఒక్క రూపాయిని ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఈ ఆర్థిక సంవత్సరం విషయానికి వస్తే ఇంత వరకు ఒక్క క్వార్టర్‌ను ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో ఎన్‌క్వాస్ నిధులపై ఆరా తీయగా నిధులు రావడం లేదని, అయితే ప్రోసీడింగ్స్ మాత్రం ఇస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు వస్తున్నాయా..? రావడం లేదా..? అన్న విషయం తెలియడం లేదని, రాష్ట్ర ప్రభు త్వం అన్ని నిధులకు కలిపి ప్రొసీడింగ్స్ ఇస్తున్నదని, దీంతో ఏవి.. ఏ నిధులో అర్థం కాని పరిస్థితి నెలకొంద ని వారంటున్నారు. వాస్తవానికి ఎన్‌క్వాస్ ద్వారా వచ్చే నిధులను సక్రమంగా ఇస్తే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు చాలా బాగా అభివృద్ధి చెందుతాయని, మౌళిక వసతులతో పాటు, వైద్య సదుపాయాలు మెరుగుపడుతాయని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా త్వరగా నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు
గత 41 1/2 సంలుగా అంకిత భావంతో విధులు నిర్వహించి నేడు పదవీ విరమణ చేయుచున్న
ఎండి. రహీముద్దీన్ షరీఫ్ గారికి హృదయ పూర్వక
పదవీ విరమణ శుభాకాంక్షలు.
వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని ఆ అల్లాహ్ తో దువా చేయించు.
ASI Traffic, Karimnagar.
Son-in-Laws
MD. KHADEER, Peddapally
MD. Sirajuddin, Choppadandi
M.A. Majeed, Siddipet
కూతుర్లు:
పఠేమ్ సుల్తాన, హాజీరా సుల్తాన
ఫర్హత్ సుల్తాన, ఆనం మహతాబ్,
మహతాబ్ బేగం, కుటుంబ సభ్యులు
పదవీ విరమణ శుభాకాంక్షలు
Asst.Sub Inspector of Police
కొత్తపల్లి పోలీస్ స్టేషన్, జి. కరీంనగర్.
కుమారుడు-కోడలు: మాంకాల సమనీత్-లైశ్వర్య
కూతురు-అల్లుడు:
రావు సహస్వేత-మురళీధర్
మనుమరాలు: రావు ధీరిత
పదవీ విరమణ శుభాకాంక్షలు
గా॥ శ్రీ నీలం వెంకటేశ్వర్లు, ఇ.ఇ
ఇరిగేషన్ డివిజన్ నెం.2
SRSP క్యాంప్, మెట్‌పల్లి. జిల్లా : జగిత్యాల.
మంచికి మారుపేరుగా నిలిచి అధికారుల అందరి మన్ననలు పొందిన గా॥ శ్రీ నీలం వెంకటేశ్వర్లు, ఇ.ఇ. గారు
తేది: 30-09-2024 రోజున పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా వారికివే మా హార్థిక శుభాకాంక్షలు.
అభినందనలతో..
సిబ్బంది
ఇరిగేషన్ డివిజన్ నెం. 2,
SRSP CAMP మెట్‌పల్లి, జిల్లా: జగిత్యాల.
పదవీ విరమణ శుభాకాంక్షలు
ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది అందరి మన్ననలందుకొని మమ్మల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దిన మా మార్గ దర్శకులు, వైస్ సమానులైన మా నాన్న
శ్రీ ఎనకొండ బుచ్చిరెడ్డి గారి
పదవీ విరమణ శుభ సందర్భంగా
వారికి భగవంతుడు ఆయురారోగ్యములు ప్రసాదించాలని కోరుకుంటూ...
శ్రీమతి & శ్రీ ఎనకొండ బుచ్చిరెడ్డి-స్వరూప గార్లు
ప్రధానోపాధ్యాయులు MPUPS, వితరాజీపల్లి, మం॥ సుల్తానాబాద్, జి॥ పెద్దపల్లి
కుమారుడు: ఎనకొండ సాయిప్రవీన్‌రెడ్డి
Data Engineer, USA
కూతురు-అల్లుడు: వేనుముద్దల సాయిప్రవలిక-శ్రీకాంత్‌రెడ్డి
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ USA